# క్షణికావేశం

రాగిణి కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. క్షణాని కోసారి రాగిణి తన కళ్లను చేతిలో ఉన్న కర్చీఫ్‌తో సున్ని తంగా తుడుచుకుంటోంది. తుడిచినకొద్దీ రాగిణి కళ్ల నుండి నీరు నిర్విరామంగా కారుతూనే ఉంది. మెడిసి న్‌లో సీటురాలేదని తను ఇంతగా బాధపడుతున్నట్లు తల్లిదండ్రులకు తెలియకూడదని జాగ్రత్తపడుతోంది రాగిణి.

తను ఎంతో కష్టపడి చదివింది. తన శాయశక్తులా మెడిసన్ సీటుకోసం ప్రయత్నం చేసింది. తన ప్రయత్న లోపం ఏమీలేదు. అయినా హెవీ కాంపిటీషన్‌లో తను తట్టుకోలేకపోయింది. ఇప్పుడు ఏమిటి చెయ్యడం? తెలి సినవాళ్లందరికీ ఏమని సమాధానం చెప్పాలి? తన స్నేహి తుల ముందు తను చులకనైపోతుంది. ఏమిటీ విషమ పరిస్థితి? తను ఇప్పటివరకూ చదివిన చదువుకు అర్థమే మిటి? అసలు తన తల్లిదండ్రులు తన విషయంలో ఎన్ని ఆశలు పెంచుకున్నారో! తను వారి ఆశలన్నిటినీ నీరు కార్చేసింది. తన తల్లిదండ్రులు ఈ విషయంలో ఎంత బాధపడుతున్నారోనని మధనపడసాగింది రాగిణి.

గుండెలనిండా భారాన్ని నింపుకొని మరికాసేపు ఆలో చించింది రాగిణి.

"అమ్మా రాగిణీ!" అన్న తల్లి పిలుపు విన్పించి ఈ లోకంలోకి వచ్చింది రాగిణి.

"రాగిణీ! ఈ గిన్నెలు కాస్త సర్దిపెట్టు" అంది రాగిణి తల్లి జానకి. "అలానే" అంటూ రాగిణి కిచెన్‌లో తల్లికి సహాయం చేసింది.

మరికాసేపైన తరువాత తన రూంలోకి వచ్చింది రాగిణి. అనేక ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి. మెడిసిన్‌లో సీటురాలేదనే బాధ ఆమెలో ఉధృతమైంది.

ఈ బాధ నుండి తను ఎలా తప్పించుకోవాలి? తను ఎలా ఉపశమనం పొందాలి? తనకు మనశ్శాంతి ఎలా లభిస్తుంది? ఆలోచించసాగింది రాగిణి. అనుకోకుండా మెరుపులా ఒక ఆలోచన వచ్చింది రాగిణికి.

'యస్..యస్..యస్.. అదే తగిన పరిష్కార మార్గం' మరోసారి అనుకుంది రాగిణి.

"అమ్మా రాగిణీ!" అన్న తండ్రి పిలుపుకి తన ఆలోచ నలలో నుండి బయటపడింది రాగిణి.

"అమ్మా రాగిణీ! చీకటి పడింది. హాల్లో లైటు వేయమ్మా" అన్న తల్లి మాటలకు రాగిణి నెమ్మదిగా లేచి హాల్లోకి వెళ్లి లైట్లు వేయబోయింది. అంతే...ఒక్కసారిగా పెద్దగా శబ్దంతో కరెంటు స్విచ్ దగ్గర మెరుపులా వచ్చి రాగిణికి కరెంట్‌షాక్ తగిలింది. రాగిణి చెయ్యి స్విచ్ దగ్గరే ఇరుక్కుపోయింది.

పరిస్థితిని గమనించిన రాజశేఖరంగారు ఒక్క ఉదుటున వెళ్లి మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, రాగిణిని ఇవతలకు తీసుకువచ్చారు. శబ్దం విని రాగిణి తల్లి జానకి కూడా పరిగెత్తుకుంటూ హాల్లోనికి వచ్చింది. చలనం లేకుండా పడి ఉన్న రాగిణిని చూసి పెద్దపెట్టున ఏడవసాగింది. రాజశేఖరం ధైర్యం కూడగ ట్టుకుని రాగిణిని వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. హాస్పటల్‌లో వెంటనే రాగిణికి ట్రీట్‌మెంట్ జరిగింది. రాగిణి పరిస్థితి కొంతవరకు మెరుగుగా అనిపించింది.

* * *

రాగిణికి స్పృహ వచ్చింది. నీరసంగా కళ్లు తెరిచింది. రాగిణి బెడ్ మీద తన ప్రక్కనే కూర్చున్న తల్లి జానకి వైపు చూసింది. ఆమె కన్నీరు మున్నీరుగా విలపిస్తూండటం కనిపించింది రాగిణికి. అక్కడే కుర్చీలో కూర్చున్న రాజశేఖ రంగారిని చూసింది. పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు రాగి ణికి. కళ్లు తెరిచిన రాగిణిని చూసేసరికి దుఃఖం ఇంకా కట్టలు తెంచుకుంది జానకికి.

"తల్లీ రాగిణీ! ఎలా ఉందమ్మా! ఒంట్లో ఎలా ఉంది? ఎంత ఘోరం జరిగిపోయింది? ఎలా ఉన్నావు తల్లీ? ఎలా ఉన్నావు? ఒంట్లో ఇంకా బాధ ఏమీ లేదుకదా" అంటూ రాగిణి చేతులు గట్టిగా పట్టుకొని విలపిస్తోంది జానకి.

గొంతు పెగల్చుకుని "నాకేమైందమ్మా!" అంది రాగిణి.

"స్విచ్ వెయ్యబోతే నీకు కరెంటు షాక్ తగిలిందమ్మా. రెండు రోజులుగా నువ్వు స్పృహలో లేవు. నీ పరిస్థితి చూసి గుండెలు పగిలిపోతున్నాయమ్మా. రెండు రోజు లుగా నేను, మీ నాన్నగారు అస్సలు నిద్రపోలేదు. మా పరిస్థితి ఆ భగవంతునికే తెలియాలి. మేము అదృష్టవం తులమమ్మా. నువ్వు బ్రతికి బయటపడ్డావు. లేకుంటే నీతోపాటు మేము కూడా ఈపాటికి చనిపోయి ఉండే వాళ్లం. నువ్వు లేకుండా మేము బ్రతకలేమమ్మా" అంటూ ఆవేశంగా చెప్పుకుపోతోంది జానకి.

తల్లి మాటలు విన్న తర్వాత జరిగిందంతా జ్ఞాపకానికి వచ్చింది రాగిణికి. చీకటి పడిందని తల్లి లైటు వేయమ నడం, తను లైటు వెయ్యబోవడం, ఆ తర్వాత ఏమైందో తనకు తెలీదు.

"రాగిణీ ఇప్పుడెలా ఉందమ్మా" అంటూ ఆప్యా యంగా అడిగారు తండ్రి రాజశేఖరం.

"భాగానే ఉంది నాన్నా!" అంది రాగిణి.

"ఎంత ప్రమాదం తప్పిందమ్మా నీకు! నీకు ఏదైనా జరిగితే మేము ఏమైపోయేవాళ్లమో!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు రాజశేఖరంగారు.

తండ్రి కళ్లలో నీరు చూసి చలించిపోయింది రాగిణి.

"తల్లీ రాగిణీ! నువ్వు బ్రతికి బయటపడితేనేగానీ, నేను భోజనం చేయకూడదని ఒట్టు పెట్టుకున్నానమ్మా. నువ్వు బ్రతికి బయటపడ్డావు. నాకు అంతే చాలమ్మా" అంటూ కన్నీళ్లు తుడుచుకుంది జానకి. తల్లిదండ్రుల పరిస్థితి గమనించింది రాగిణి. జరిగిన విషయానికి తల్లి దండ్రులు ఎంతగా కుమిలిపోతున్నారో అర్థం చేసు కుంది.

తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు తనకు కరెంటు షాక్ తగిలితేనే ఎంతగానో విలవిల్లాడిపోయారు. ఎంత గానో చలించిపోయారు. నిద్రాహారాలు మానేసి తన వైపే చూస్తూ, తనలో కదలిక కోసం ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కొని కళ్లు కాయలు కాచేట్లు ఎదురుచూసారు. అటు వంటి తల్లిదండ్రులని కాదని తను ఆత్మహత్య చేసుకోవా లనుకోవడం ఎంత మూర్ఖత్వం? తను ఆత్మహత్య చేసు కుంటే వాళ్లు ఏమైపోతారు? ప్రాణానికి ప్రాణంలా తనని పెంచి పెద్దచేసారు. ప్రతిరోజూ తనని చూసి మురిసి పోతూ ఉంటారు. ఇంటికి కాస్త ఆలస్యంగా వస్తే విలవి ల్లాడిపోతారు. అటువంటిది తను ఆత్మహత్య చేసుకుంటే వాళ్లు జీవితంలో కోలుకుంటారా? అసలు ఆ వయసులో వాళ్లకి కడుపుకోతని మిగల్చవచ్చా? అనుకుంటూ ఆపైన ఊహించలేకపోయింది రాగిణి.

"రాగిణీ! ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్? " అంటూ దీనంగా చూసింది తల్లి జానకి.

"ఏమీ లేదమ్మా! జరిగిన విషయం గురించే ఆలోచి స్తున్నాను" అంది రాగిణి.

"అంతా మా అదృష్టం తల్లీ! నువ్వు ఏ ప్రమాదానికీ లోనుకాకుండా మాకు దక్కావు. మాకు అంతే చాలు" సంతృప్తిగా అంది జానకి.

తన తల్లిదండ్రులు తనకు మెడిసిన్‌లో సీటురాలేదని ఆ క్షణంలో మాత్రమే బాధపడ్డారు. ఆ తర్వాత ఆ విషయం మామూలైపోయింది. ఆ తర్వాత దానిగురించి మర్చేపోయారు. కానీ తనకు కరెంటు షాక్ తగిలిన విషయం మర్చిపోలేకపోతున్నారు. అది తలుచుకుంటే రాగిణికి వెన్నులో నుండి వణుకు పుట్టుకొచ్చింది.

"రాగిణీ ఈ జ్యూస్ తాగమ్మా" అంటూ జ్యూస్ అందించింది జానకి.

తల్లిదండ్రుల ఇంతటి అపురూపమైన ప్రేమను కాదనేనా తను అలా మూర్ఖంగా ఆలో చించింది? మధురమైన ప్రేమను పంచే తల్లిదం డ్రుల సమక్షాన్ని వీడటం ఎంత అమానుషమైన పని? ఇంటికి వెళ్లగానే తలగడ క్రింద దాచిన నిద్ర మాత్రల సీసాని తండ్రి గదిలో యదాస్థానంలో పెట్టెయ్యాలి. జీవితంలో మరెప్పుడూ ఇటువంటి పిచ్చి ఆలోచనలు రానీయకూడదు అనుకుంటూ దృఢమైన నిర్ణయం తీసుకుంది రాగిణి.

**-జి.మేరీకృపాబాయి (మచిలీపట్నం)**

